క్లుప్తంగా

వినియోగదారులు హక్కులను సాధించుకోవాలి



వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న భళ్లమూడి

పెద్దాపురం: వినియోగదారులు తమ హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వినియోగదారుల సంఘం అధ్యక్షుడు భళ్లమూడి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో గురువారం సాయంత్రం వినియోగదారుల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలన్నారు. సినిమా హాళ్లలో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోయినా, అసౌకర్యంగా అనిపించినా వినియోగదారుల తరపున ప్రశ్నించొచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎండీ సుభాని, కేవీవీ లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలపై విచారణ



పీబీ దేవం ప్రైవేటు పాఠశాలలో విచారణ చేస్తున్న అధికారులు

సామర్లకోట: మండల పరిధిలోని పీబీ దేవం గ్రామంలో నిర్వహిస్తున్న ఒక ఇంగ్లిష్ మీడియం ప్రైవేటు పాఠశాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ గురువారం విచారణ చేపట్టింది. ప్లాను తీసుకోకుండానే సుమారు 97 సెంట్లలో పాఠశాల భవనం నిర్మించడమే కాకుండా పంచాయతీకి పన్నులు చెల్లించడం లేదని జిల్లా పరిషత్ సీఈఓ ఎన్.సత్యనారాయణకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎంపీడీఓ శ్రీలలిత, సామర్లకోట ఎంఈవో శివరామకృష్ణయ్య, పెద్దాపురం ఎంపీడీఓ హిమమహేశ్వరిలతో కూడిన కమిటీని విచారణకు ఆదేశించారు. వారు గురువారం పీబీదేవంలోని సదరు ప్రైవేటు పాఠశాలకు వెళ్లి స్కూలు కరస్పాండెంట్ తోటకూర వెంకటేశ్వరరావును విచారించారు. దీనిపై ఎంఈఓ శివరామకృష్ణయ్యను వివరణ కోరగా ప్రతి అంశంపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు.

'సర్వే' రాళ్ల ఏర్పాటు



రాళ్ల ఏర్పాటును ప్రారంభిస్తున్న సర్పంచి మణికంఠబాబు

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాద్‌లో గురువారం రీసర్వేలో భాగంగా సరిహద్దు రాళ్ల ఏర్పాట్లను సర్పంచ్ నక్కా మణికంఠబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జోన్ సర్వేయర్ అప్పారావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక శాఖ ఆర్డీగా స్వామినాయుడు



కలెక్టర్ కృతికా శుక్లాను కలసిన పర్యాటకశాఖ ఆర్డీ స్వామినాయుడు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్‌గా వి.స్వామినాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లాను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యాటకానికి సంబంధించి బీచ్ ఫ్రంట్ ఫుడ్ కోర్టులు పునఃప్రారంభించడానికి హోప్ ఐలాండ్ బోటును త్వరలో పునరుద్ధరించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. రీజినల్ డైరెక్టర్ స్వామినాయుడుతో పాటు డివిజనల్ మేనేజర్ సీహెచ్ పవన్‌కుమార్, డీటీఓలు పసుపులేటి పోశయ్య, పి.వెంకటచలం, ఎ.వెంకటరావు, వి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

సెలవుపై కమిషనర్

- ఇన్‌చార్జిగా ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ సెలవుపై వెళ్లారు. శుక్రవారం నుంచి మార్చి 8వ తేదీ వరకు సెలవు పెట్టారు. వ్యక్తిగత కారణాలు దృష్ట్యా సెలవుపై వెళ్తున్న ఆయన స్థానంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. సుమారు 13 రోజుల పాటు సెలవుపై వెళ్తున్న నేపథ్యంలో ఏడీసీని ఎఫ్ఏసీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రానున్నాయి.

భవనాలు శిథిలం.. జ్ఞాపకాలు పదిలం

- అవసాన దశలో పోలీస్ క్వార్టర్లు
- అద్దె ఇళ్లల్లో పోలీసు కుటుంబాలు

పెద్దాపురం: పెద్దాపురంలోని పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. అక్కడే ఉన్న సీఐ, ఎస్ఐ భవనాలదీ అదే పరిస్థితి. వాటి దుస్థితిని చూసి సొంత పెట్టుబడులు పెట్టలేక పోలీసులందరూ ఖాళీ చేసి అద్దె ఇళ్లను ఆశ్రయించారు. కొన్నేళ్లుగా అక్కడెవరూ నివాసం ఉండడం లేదు. రక్షకభటుల క్వార్టర్ల దుస్థితిపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

దశాబ్దాల క్రితమే పెద్దాపురం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉండే కొండయ్యపేటను ఆనుకుని పోలీసు కుటుంబాలు నివాసముండేలా క్వార్టర్లను, అక్కడే సీఐ, ఎస్ఐల కోసం ప్రత్యేక భవనాలను నిర్మించారు. పెద్దాపురం స్టేషన్‌లో విధులు నిర్వర్తించే పోలీసులకు ఈ క్వార్టర్లను కేటాయించారు. సుమారు పద్దెనిమిదేళ్లుగా ఈ సముదాయానికి కనీస మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. భవనాలన్నీ ప్రమాదకరంగా మారిపోయినా గతేడాది వరకూ రెండు క్వార్టర్లలో పోలీసు కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశాయి. అయితే చిన్న చిన్న మరమ్మతులకు సైతం సొంత జేబుల్లోంచే సొమ్ములు ఖర్చు చేయాల్సి వస్తుండడంతో వారంతా ఖాళీ చేసి వెళ్లిపోయారు.



శిథిలమైన పెద్దాపురంలోని పోలీసు క్వార్టర్లు



తలుపులు ఊడిపోయి నివాసయోగ్యంగా లేని ఎస్ఐ క్వార్టరు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

క్వార్టర్లలో విద్యుత్ వైరింగ్ కాలిపోయి, బోర్డులు వేలాడుతున్నాయి. కిటికీ తలుపులు ఏనాడో ఊడిపోయాయి. తలుపులు కూడా రక్షణ ఇవ్వలేని దుస్థితిలో ఉన్నాయి. గోడలకు వేసిన సిమెంట్ పూత సైతం పెచ్చులూడి పడుతుంది. బాత్‌రూంలకు తలుపులు పూర్తిగా ఊడిపోయాయి. డ్రైనేజీ వ్యవస్థ లేనే లేదు. శిథిల భవనాల ఆవరణలో తుప్పలు పెరిగిపోయి, విష సర్పాలకు ఆవాసంగా మారిపోయాయి. స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాల సమయంలో పోలీసులు తుప్పలు నరికి కాస్త శుభ్రం చేయడం, తిరిగి తుప్పలు పెరిగిపోవడం సర్వసాధారణమై పోయింది. పెద్దాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 165 పోలీస్ క్వార్టర్స్ శిథిల స్థితికి చేరుకున్నట్లు పోలీస్ సిబ్బంది చెబుతున్నారు. ఎవరూ నివాసముండకపోవడంతో కొందరు వీటిని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శిథిలమైన క్వార్టర్ల స్థానంలో కొత్త భవన సముదాయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పోలీసు సిబ్బంది కోరుతున్నారు.

నివాసయోగ్యంగా లేవు



పోలీసు క్వార్టర్స్ శిథిలస్థితికి చేరుకున్నాయి. అవి నివాసయోగ్యంగా లేవని ఉన్నతాధికారులకు నివేదిక సైతం ఇచ్చారు. దీనిపై నూతన భవన నిర్మాణాలకై ప్రతిపాదనలు పంపించారు.

– వెలుగుల సురేష్, ఎస్ఐ, పెద్దాపురం

మహాశివరాత్రి ఆదాయం రూ.11.84 లక్షలు

సామర్లకోట: మహాశివరాత్రి సందర్భంగా పంచారామ క్షేత్రమైన కుమార భీమేశ్వర స్వామి ఆలయంలో పూజా టిక్కెట్లు, అభిషేకాలు, అన్నదానాల విరాళాల నిమిత్తం కలుపుకుని మొత్తంగా రూ.11,84,496 ఆదాయం వచ్చినట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పూజా, అభిషేక టిక్కెట్ల ద్వారా రూ.9,63,055, అన్నదానానికి విరాళాలుగా రూ.2,21,441 వచ్చాయన్నారు. త్వరలో హుండీల లెక్కింపు ఉంటుందన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కరరావు తెలిపారు. ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని, సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

మూడుముళ్ల సూత్రధారి
మొండి జగ్గప్ప

- స్వామిని దర్శిస్తే పెళ్లిపీటలెక్కుతారని భక్తుల విశ్వాసం
- వచ్చేనెల మూడున స్వామి కల్యాణానికి ఏర్పాట్లు
- శోభాయమానంగా తీర్చిదిద్దుతున్న ఆలయ పరిసరాలు

కొత్తపల్లి: పూరీ జగన్నాథస్వామిని పోలి ఉండే మూలపేటలోని (బలభద్ర సుభద్ర సమేత జగన్నాథ స్వామి, శ్రీ, భూ సమేత సత్యనారాయణస్వామి) మొండి జగ్గప్ప స్వామిని దర్శించుకుంటే అవివాహితులకు వివాహం, సంతానం లేని వారికి సంతానం కలుగుతాయని స్థానికుల విశ్వాసం. మార్చి మూడో తేదీ రాత్రి స్వామి వారి దివ్య కల్యాణానికి ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ మాడుగుల ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులు, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు.

సుమారు 367 ఏళ్ల క్రితం మూలపేట సమీపంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు ఈ కలప విగ్రహాలు చిక్కాయి. వాటిని గ్రామంలోకి తీసుకువస్తుండగా బరువు పెరగడంతో మోయలేక వదిలేసిన చోటే ఆలయాన్ని నిర్మించినట్టు పెద్దలు చెప్తారు. పూరీలో జగన్నాథస్వామి ఉత్సవాల అనంతరం ఆ విగ్రహాలను సముద్రంలో నిమజ్జనం చేస్తారు. అలా నిమజ్జనం చేసిన విగ్రహాలే ఇక్కడకు కొట్టుకు వచ్చి ఉండవచ్చని వారి నమ్మకం. అప్పటి నుంచి ఇక్కడ జగన్నాథస్వామిగా ఎటువంటి అవయవాలు కనిపించకుండా కేవలం ఆకృతి మాత్రమే ఉండడంతో ఈ స్వామిని మొండి జగ్గప్పగా పిలుస్తూ పూజిస్తుంటారు. అలాగే ఈ ఆలయంలో నుయ్యి తవ్వుతుండగా మరికొన్ని విగ్రహాలు లభించాయని, వాటిని స్థానికులు ఒక ధాన్యపు కొట్టులో ఉంచగా రాత్రుళ్లు వాటి నుంచి శబ్దాలు రావడంతో వాటిని పూర్తిగా పరిశీలించగా అవి శ్రీ, భూ సమేత సత్యనారాయణ స్వామి విగ్రహాలుగా గుర్తించి వాటికీ ఆలయం నిర్మించినట్టు చెప్తారు.



మూలపేటలోని బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి

స్వామిని దర్శిస్తే వివాహం ఖాయం!

స్వామి వారికి పూలమాల వేసి దర్శించుకుని మొక్కుకుంటే వివాహం కాని వారికి వెంటనే వివాహం జరుగుతుందని, సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని, భక్తులకు అపార నమ్మకం. అందుకే అవివాహితులు చాలా మంది ఈ ఆలయాన్ని దర్శిస్తారు. అలాగే పిల్లలు పుట్టని వారు ముందు స్వామికి మొక్కుకుని పిల్లలు పుట్టాక తులాభారం సమర్పించుకుంటారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తాం

యువజన, మహిళా విభాగాల అధ్యక్షులు కొప్పన, వర్ధినీడి



కొప్పన శివనాథ్‌ను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబుకు ధన్యవాదాలు తెలియజేస్తున్న సుజాత

పిఠాపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు, సీఎం జగన్‌ను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యంగా పని చేస్తామని వైఎస్సార్ సీపీ యువజన, మహిళా విభాగాల అధ్యక్షులుగా నియమితులైన కొప్పన శివనాథ్, వర్ధినీడి సుజాత తెలిపారు. తమ మీద నమ్మకం ఉంచి ఇంత బాధ్యతలను అప్పగించిన సీఎం జగన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో కీలకమైన యువజన, మహిళా విభాగాలకు తమ పేర్లను సూచించిన ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తమ శక్తి వంచన లేకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. ఎక్కువగా యువతను పార్టీకి ఆకర్షితులను చేయడం, మహిళలకు పార్టీ చేస్తున్న ప్రజా సంక్షేమాన్ని వివరించడం ద్వారా రెండు విభాగాలలో అధికులను పార్టీకి పని చేసేలా చేయడానికి ఇప్పటి నుంచి ప్రయత్నిస్తామని అన్నారు.

బిందుసేద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

పెద్దాపురం: బిందు సేద్యంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని పెద్దాపురం మండల ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత అన్నారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలోని రైతు గొల్లబాబు పామాయిల్ తోటలో గురువారం ఉద్యాన శాఖ, పతంజలి ప్రైవేట్ లిమిటెడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పాం సాగులో సమగ్ర యాజమాన్య సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చన్నారు. ఈ సందర్భంగా రైతులకు పిచికారీ మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పతంజలి డీజీఎం రవీంద్ర, పి.దుర్గారావు, కె.వెంకటేశ్వరరావు, డీఎల్ వెంకటేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పిచికారీ మందులను అందజేస్తున్న ఉద్యానశాఖ అధికారులు

డ్వామా అధికారులకు కొనసాగుతున్న శిక్షణ

సామర్లకోట: డ్వామా అధికారులకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్టణం, విజయనగరం జిల్లాల్లో పని చేస్తున్న డ్వామా ఏపీడీ, ఏపీఓ, ఏసీ, టెక్నికల్ అసిస్టెంట్లకు మూడు రోజుల పాటు ఇస్తున్న శిక్షణ రెండో రోజు గురువారం కొనసాగింది.

రెండో రోజు పారామీటర్లకు సంబంధించి వృత్తి నైపుణ్యం, సోషల్ ఆడిట్, ఉపాధి కూలీలకు సొమ్ము చెల్లింపు, పనుల అంచనాలు వేసే విధానంపై శిక్షణ ఇచ్చామని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర టెక్నికల్ రీసోర్సు పర్సన్ స్వరూపరాణి తెలిపారు.



డ్వామా అధికారులకు శిక్షణ ఇస్తున్న స్టేట్ టెక్నికల్ రీసోర్సు పర్సన్ స్వరూపరాణి

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించండి

- ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు
- నేర సమీక్షలో అధికారులకు ఆదేశం

కాకినాడ క్రైం: స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది, అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆదేశించారు. స్టేషన్ సిబ్బందితో ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. గురువారం కాకినాడలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో నేర సమీక్ష జరిగింది. పెండింగ్ అట్రాసిటీ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులు, గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్ కేసులపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించి కేసుల సత్వర పరిష్కారం, సక్రమ విచారణ కు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సహాయపడేందుకు పోలీస్ స్టేషన్ల రిసెప్షన్‌లో మహిళా పోలీసులను ఉంచాలని సూచించారు. మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రతి పోలీసు అధికారి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. లోన్ యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని చెప్పారు. రాత్రి గస్తీ పెంచి, డైనమిక్ బీట్లు, ఆస్తి నేరాలు జరిగే ప్రాంతాలపై నిఘా పెంచి దొంగతనాలు జరగకుండా చూడాలన్నారు. దర్యాప్తు పూర్తి అయిన కేసుల్లో చార్జిషీట్లు త్వరగా ఫైల్ చేసి, కోర్టులో విచారణ ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)పై మహిళా పోలీస్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేసి, ఉత్తమ ఫలితాలు సాధించిన సీఐలు, ఎస్సైలకు ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. సమీక్షలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, ఏఆర్ అదనపు ఎస్పీ బి.సత్యనారాయణ, ఎస్‌బీ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, పెద్దాపురం ఎస్‌డీపీఓ ఎస్.మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రవీంద్రనాథ్ బాబు

లాడ్జిలో మహారాష్ట్ర వాసి మృతి

కాకినాడ రూరల్: కాకినాడ ఎల్బీ నగర్‌లోని ఒక లాడ్జిలో మహారాష్ట్ర వాసి మృతి చెందాడు. సర్పవరం పోలీసులు వివరాలు ప్రకారం... మహారాష్ట్రం థానేకు చెందిన జ్ఞానేశ్వర్ రామకృష్ణ సనత్(44) బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. వాకలపూడిలోని ఎక్స్ లాగ్ కంపెనీలో ఇంజినీర్‌గా అతడు పనిచేస్తున్నాడు. 15 రోజులు విధుల్లో 15 రోజులు స్వగ్రామంలో ఉండే సనత్ బుధవారం మధ్యాహ్నం విధులకు రాకపోవడంతో మహారాష్ట్రకు చెందిన సహచరులు ఫోన్ చేశారు. అయినప్పటికీ ఫోన్ ఎత్తకపోవడంతో లాడ్జి మేనేజర్‌కు ఫోన్ చేశారు. వారు వచ్చి తలుపులు తెరిచే సరికి మంచంపై కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా సనత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లాడ్జి మేనేజర్ సదానందం ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్సై సతీష్‌కుమార్ గురువారం కేసు నమోదు చేశారు. సనత్ కుటుంబ సభ్యులకు బుధవారమే సమాచారం ఇవ్వడంతో వారు కాకినాడ చేరుకోగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు.

చిట్స్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా భాస్కర్

కాకినాడ లీగల్: కాకినాడ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ (సబ్ రిజిస్ట్రార్) ఎం.సుధారాణిని డిప్యూటేషన్‌పై పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరం సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో చిట్స్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ వీవీ భాస్కర్‌ను ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా స్క్వాష్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నవీన్‌కృష్ణ

నాగమల్లితోట జంక్షన్: కాకినాడ జిల్లా స్క్వాష్ అసోసియేషన్ అధ్యక్షునిగా డాక్టర్ ముత్తా నవీన్ కృష్ణ ఎన్నికైనట్లు జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి కె.పద్మనాభం గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్క్వాష్ అసోసియేషన్‌గా ఉండేదని, ఇప్పుడు కాకినాడ జిల్లాకు ప్రత్యేకంగా సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడు ముత్తా నవీన్ కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ముత్తా క్లబ్, డీఎస్ఏలో స్క్వాష్ కోర్టులు అందుబాటులో ఉన్నాయన్నారు. మేలో రాష్ట్రస్థాయి పోటీలను జిల్లాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 182 దేశాల్లో ఈ క్రీడ ఆడుతున్నారని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ముగ్గురు నామినేషన్లు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికకు సంబంధించి గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో నామినేషన్ల సంఖ్య నాలుగుకు చేరింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కుడుపూడి సూర్యనారాయణరావు నామినేషన్ ఇప్పటికే దాఖలు చేయగా గురువారం టీడీపీ తరఫున కడలి సాయిదుర్గ నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా అంబటి కోటేశ్వరరావు, ఇంత సంతోషం నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించనున్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు

పిఠాపురం: బాల్య వివాహాలు బాలికల జీవితాలను నాశనం చేస్తాయని, వాటిని పెద్దలు ప్రోత్సహించకూడదని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ దుర్గాదేవి అన్నారు. పిఠాపురం మండలం జల్లూరులో గురువారం నిర్వహించిన బాల్య వివాహాలపై అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసులో వివాహాలు చేయాలని ప్రయత్నించడం చట్టరీత్యా నేరం అన్నారు. అవగాహన లేక కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసులో వివాహాలు చేస్తున్నారని, వారికి అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీఓ దుర్గాదేవి

మద్యం మత్తులో ఆర్టీసీ బస్సుపై దాడి

పిఠాపురం: కత్తిపూడి నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై పిఠాపురం రామా సెంటర్లో ఒక వ్యక్తి రాళ్లతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ బస్సు రామా సెంటర్లోకి రాగానే మద్యం మత్తులో వీరంగం చేస్తున్న పిఠాపురం అగ్రహారం రెల్లి పేటకు చెందిన అల్లం శ్రీను ఒక్క సారిగా రాళ్లతో బస్సుపై దాడికి దిగాడు. దీంతో ఏమి జరుగుతోందో తెలియక బస్సు డ్రైవరుతో పాటు ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీంతో డ్రైవరు బస్సును అక్కడే నిలిపి వేసి రాళ్లు రువ్విన వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయాడు. చివరకు సీసీ పుటేజీ ఆధారంగా ఆవ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై జగన్మోహన్ తెలిపారు.

సెమీస్ దశలో జాతీయ వుమెన్ సీనియర్స్ హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న జాతీయ వుమెన్ సీనియర్స్ హాకీ చాంపియన్ షిప్ పోటీలు గురువారం సెమీస్ దశకు చేరుకున్నాయి. మొదటి క్వార్టర్ ఫైనల్స్‌లో ఒడిశా, మహారాష్ట్ర జట్లు పోటీ పడ్డాయి. ట్రై బేకర్ కాగా పెనాల్టీ షూట్స్‌లో రెండు జట్లు చెరో మూడు గోల్స్ చేశాయి. మరో అవకాశం ఇవ్వగా మహారాష్ట్ర గోల్ చేయగా, ఒడిశా చేయలేకపోయింది. దీంతో మహారాష్ట్రను విజేతగా నిర్ణయించారు. రెండో క్వార్టర్ ఫైనల్స్‌లో మధ్యప్రదేశ్, కర్నాటక జట్లు పోటీ పడ్డాయి. మధ్యప్రదేశ్ 6–0 స్కోర్‌తో గెలిచింది. మూడో మ్యాచ్‌లో జార్ఖండ్, పంజాబ్ జట్లు తలపడ్డాయి. జార్ఖండ్ 2–0 స్కోర్ తేడాతో విజయం సొంతం చేసుకుంది. నాలుగో మ్యాచ్‌లో హర్యానా, బెంగాల్ జట్లు పోటీ పడ్డాయి. 5–0 స్కోర్‌తో హర్యానా గెలిచింది. గురువారం జరిగిన మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ రాయ్, కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారి పీటర్, టోర్నమెంట్ కో–ఆర్డినేటర్ వి.రవిరాజు, పరిశీలకుడు భూపేంద్రసింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ శుక్రవారం హర్యానా–మహారాష్ట్ర మధ్య మొదటి సెమీఫైనల్స్, జార్ఖండ్–మధ్యప్రదేశ్ మధ్య రెండో సెమీఫైనల్స్ జరుగుతాయని తెలిపారు.



ఒడిశా- మహారాష్ట్ర జట్ల మధ్య సాగిన మ్యాచ్

శాస్త్ర విజ్ఞాన ప్రగతితో దేశాభివృద్ధి

- ఆర్జేడీ నాగమణి

కాకినాడ సిటీ: కాకినాడ ఏజీఎం ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ గురువారం రాత్రి ముగిసింది. పాఠశాల ఆర్జేడీ జి.నాగమణి మాట్లాడుతూ ఈ ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యం నూతన ఆవిష్కరణశక్తిని వెలికి తీస్తాయన్నారు. విజ్ఞాన శాస్త్ర ప్రగతితో దేశాభివృద్ధి సాధ్యమన్నారు. డీఈఓ కేవీఎస్ఎస్ అన్నపూర్ణ, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, కాకినాడ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జె డేనియల్ రాజు పాల్గొని ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న విద్యాశాఖాధికారులు